

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక




మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 17-05-2026 | సంపుటి - 27 | సంచిక -354 | రూ : 4 | పేజీలు: 8




# చర్లపల్లి జైలుకు బండి భగీరథ్

- పోక్సో కేసులో 14 రోజుల పాటు రిమాండ్
- మేడ్చల్ జిల్లా 9వ అదనపు మేజిస్ట్రేటు తీర్పు
- పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సరెండర్

హైదరాబాద్ : పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచే నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ముందస్తు బెయిలుకు, అరెస్టు నుంచి రక్షణకు హైకోర్టులో భగీరథ్‌కు ఉపశమనం లభించని

తరువాయి 2లో





విదేశమా? స్వదేశమా? 2లో

# మోదీ భావోద్వేగం!

- నెదర్లాండ్స్ లోని ది హేగ్ లో ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మోదీ
- ఆర్థిక, సాంకేతిక రంగాలలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- సెమీకండక్టర్ల తయారీ రంగంలో వేగంగా ముందడుగు వేస్తున్నామన్న ప్రధాని

## అలా చేస్తే చరిత్రలో కలిసిపోతారు
## పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక



- పాకిస్తాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరిక
- ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తే చరిత్రలో కలిసిపోతారని వ్యాఖ్య
- ఢిల్లీలో జరిగిన 'సేనా సంవాద్' కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

2లో



## దేశంలో పెరిగిన నిరుద్యోగం..
## ఆరు నెలల్లో ఇదే అత్యధికం!

- ఏప్రిల్‌లో ఆరు నెలల గరిష్ఠానికి చేరిన భారత నిరుద్యోగిత రేటు
- గ్రామీణ ప్రాంతాల్లో పెరిగి, పట్టణ ప్రాంతాల్లో తగ్గిన నిరుద్యోగం
- పట్టణ మహిళల నిరుద్యోగిత రేటు ఏడాది కనిష్ఠానికి పతనం
- మొత్తం మీద తగ్గిన కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్)
- పట్టణ, గ్రామీణ ఉపాధి కల్పనలో స్పష్టంగా కనిపిస్తున్న వ్యత్యాసం

2లో

# భానుడి భగభగ

- మళ్లీ 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీలు
- గాలిలో తగ్గిన తేమ శాతం... ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- పలు జిల్లాల్లో కురిసిన వర్షం

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మళ్లీ ఎండలు క్రమంగా పెరుగుతూ 45 డిగ్రీలకు చేరుతున్నాయి. శనివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాత్రి పూట కూడా

తరువాయి 2లో



## సంతానం పెంచితే ఆర్థిక సాయం..
## చంద్రబాబు సంచలన ప్రకటన!

2లో

- పిల్లలే సంపద' పేరుతో జనాభా పెరుగుదలకు ఏపీ సర్కార్ కొత్త పథకం
- జనాభా తగ్గితే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న సీఎం చంద్రబాబు
- పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీని ప్రకటించిన ప్రభుత్వం
- శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ముఖ్యమంత్రి ప్రకటన



## మోడీ అసమర్థ పాలనకు నిదర్శనం

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సమర్థనీయం కాదు
- కేంద్రంపై 'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్ : పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సీఎం ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందనీ, నిత్యావసరాల ధరలు

తరువాయి 2లో



## ఈసారి ముందే రుతుపవనాలు..
## కానీ 'ఎల్ నినో' గండం!



- కేరళలోకి ఈ నెల 26నే ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు
- ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతంపై ఆందోళన

2లో

# చర్లపల్లి జైలుకు బండి భగీరథ్

మైనర్‌పై లైంగికదాడి జరిపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో బండి సాయి భగీరథ్‌కు 14 రోజుల పాటు రిమాండ్‌ను విధిస్తూ మేడ్చల్ జిల్లా 9వ అదనపు మేజిస్ట్రేటు శనివారం అర్ధరాత్రి ఆదేశాలు జారీ చేశారు. 5 నిమిషాలు మాత్రమే మేజిస్ట్రేటు ఇటు పోలీసులు, అటు బండి భగీరథ్ తరపు న్యాయవాదుల నుంచి వాదనలు విన్న మేజిస్ట్రేటు పై ఆదేశాలు జారీ చేశారు. దీంతో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం హుటాహుటిన రాత్రి 12 గంటల 5 నిమిషాలకు భగీరథ్‌ను చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకముందు రాత్రి 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పేట్‌బషీర్‌బాద్ పోలీసు స్టేషన్‌లో సిట్ పర్యవేక్షణాధికారి డీసీపీ రితురాజ్ నేతృత్వంలో సాయిభగీరథ్‌ను విచారించారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో బాధితురాలు ఇచ్చిన మూడు వాంగ్మూలాల ఆధారంగా భగీరథ్‌ను అధికారులు ప్రశ్నించారు. అంతేగాక విచారణకు హాజరుకావడానికి వారం పాటు ఎందుకు సమయం తీసుకున్నారు మొదలుకొని బాధితురాలు ఇచ్చిన ఆధారాల ఆధారంగా భగీరథ్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. అయితే తాను నిరపరాధిని అని పేర్కొంటు తాను తీసుకొచ్చిన కొన్ని ఆధారాలను సిట్ అధికారులకు భగీరథ్ సమర్పించారని తెలిసింది. ముఖ్యంగా బాధితురాలు మైనర్ కాదనీ, ఆమె మేజరేనంటూ కొన్ని ఆధారాలను చూపడంతో పాటు తనపై ఆమె, ఆమె కుటుంబసభ్యులు హనీట్రాప్‌నకు పాల్పడ్డారనీ, అడిగినంత డబ్బులు ఇవ్వకపోవటంతోనే తనపై దురుద్దేశపూర్వకంగా కేసు పెట్టారని నిందితుడు ఆరోపించినట్టు తెలిసింది. మొత్తమ్మీద సుదీర్ఘ విచారణానంతరం రిమాండ్ రిపోర్ట్‌ను తయారు చేసిన సిట్ అధికారులు 11.30 గంటల ప్రాంతంలో మేడ్చల్‌లోని పబ్లిక్ హెల్త్ సెంటర్‌కు వైద్యపరీక్షల నిమిత్తం భగీరథ్‌ను తరలించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి నేతృత్వంలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐదు నిమిషాల పాటు పరీక్షలు జరిపిన వైద్యులు తను ఆరోగ్యంగా ఉన్నాడని తేల్చారు. దాంతో 12 గంటల ప్రాంతంలో భగీరథ్‌ను పక్కనే ఉన్న మేజిస్ట్రేట్ నివాసానికి సిట్ అధికారులు తరలించారు. ఎట్టకేలకు చిక్కిన బండి భగీరథ్ దేశంలోనే సంచలనం సృష్టించిన బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు శనివారం కీలక మలుపుతిరిగింది. మైనర్ పై లైంగికదాడి కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్‌ను రాత్రి 8.15 గంటల ప్రాంతంలో తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద అరెస్టు చేశామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ ప్రకటించారు. అదే సమయంలో కుటుంబసభ్యుల ,ఇద్దరు న్యాయవాదుల సమక్షంలో సాయి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించామని తండ్రి బండి సంజయ్ ప్రకటించారు. ఉదయం నుంచి బండి సాయి భగీరథ్ పోక్సో కేసుకు సంబంధించి జరిగిన పరిణామాలను పరిశీలిస్తే..అనేక మలుపులు తిరిగాయి. ఉదయం నుంచి ఈ కేసుకు సంబంధించిన సిట్ అధికారులు డీసీపీ రీతురాజ్ నేతృత్వంలో నిందితుడి కోసం బండి సంజయ్ నివాసంలోనూ అటు కరీంనగర్‌లోని నివాసాలతోపాటు అతని బంధువులు, స్నేహితుల ఇండ్లలోనూ గాలింపు చర్యలు చేపట్టారు. మరో వైపు బండి సాయి భగీరథ్ దేశం దాటివెళ్లిపోండా ముందు జాగ్రత చర్యగా లుక్ అవుట్ నోటీసులు కూడా అన్ని ఎయిర్‌పోర్టులకు సిట్ అధికారులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బండి భగీరథ్ కూడా పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోనున్నారనే ప్రచారం కూడా సాగింది. ఒకపక్క గాలింపులు మరోపక్క లొంగిపోతాడనే ఊహాగానాల మధ్య నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్ వద్ద వెళ్తుండగా బండి భగీరథ్‌ను పోలీసులు రాత్రి 8 గంటలకు అదుపులోకి తీసుకున్నారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ మీడియాకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంలోనే భగీరథ్ తండ్రి బండి సంజయ్ సైతం ఒక ప్రకటన చేశారు. తన కుమారుడిని బంధువుల సాయంతో పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఇన్ని రోజులు అతడ్ని అప్పగించకపోవడానికి కారణం.. అతడికి కోర్టు నుంచి బెయిల్ లభిస్తుందని ఆశించామని అన్నారు. న్యాయ నిపుణులతో సంప్రదించి ఆ దిశగా ప్రయత్నాలు చేసిన కారణంగా ఈ జాప్యం జరిగిందని, 'చివరికి చట్టం ఎవరికైనా చట్టమేనని' అందుకే తన కుమారుడిని పోలీసులకు అప్పగించామని ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే..శనివారం రాత్రి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు నిందితుడు భగీరథ్‌ను సిట్ అధికారులు తరలించారు. అక్కడే అతడిని విచారించాక కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన తర్వాత మెజిస్ట్రేట్ నివాసంలో భగీరథ్‌ను సిట్ అధికారులు హాజరుపర్చనున్నారు. ఇదిలా ఉంటే శనివారం మూడో సారి కూడా బాధితురాలైన మైనర్ బాలికను మేడ్చల్ మెజిస్ట్రేట్ ముందు సిట్ పోలీసు అధికారులు హాజరుపరిచి ఆమె చేత వాగ్మూలం ఇప్పించారు. అంతకు ముందు ఈ నెల 8వ తేదిన పిర్యాదు చేసినప్పుడు మొదటి సారిగా పేట్‌బషీర్‌బాగ్ పోలీసులు ఆమె నుంచి వాగ్మూలం తీసుకున్నారు. తర్వాత రెండోసారి భరోసా సెంటర్‌లో కూడా అధికారులు బాధితురాలి వాగ్మూలం తీసుకున్నారు.

## విదేశమా? స్వదేశమా? మోదీ భావోద్వేగం!

భారతదేశం ప్రస్తుతం ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం సాధిస్తున్న డిజిటల్ ప్రగతిని, ప్రవాస భారతీయుల సేవలను ఆయన కొనియాడారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. దేశంలో ఇప్పుడు నెలకు ఏకంగా 20 బిలియన్ డాలర్ల మేర డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతిక రంగంలో మన దేశం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో కేవలం 4 యూనికార్న్ స్టార్టప్ సంస్థలు మాత్రమే ఉండేవని, కానీ నేడు వాటి సంఖ్య 100కు చేరిందని గుర్తుచేశారు. భవిష్యత్తు సాంకేతికతకు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, దానికి సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లో ఉన్న భారతీయుల ప్రేమ, ఉత్సాహాన్ని చూస్తుంటే తాను విదేశంలో ఉన్నాననే సంగతి మర్చిపోయానని, సొంత దేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపిస్తోందని ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. నెదర్లాండ్స్ నాయకత్వం ఎప్పుడు కలిసినా అక్కడి భారతీయ సమాజం చూపిస్తున్న ప్రతిభను, క్రమశిక్షణను ప్రశంసిస్తూనే ఉంటుందని చెప్పారు. తరాలు మారి, దేశాలు మారినా భారతీయులు తమ కుటుంబ విలువలను, సాంప్రదాయాలను ఎప్పటికీ వదులుకోలేదని కొనియాడారు. ప్రపంచంలో ఎన్నో సంస్కృతులు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ ప్రవాసుల హృదయాల్లో బలంగా సజీవంగా ఉందనడానికి ఈ సభే నిదర్శనమన్నారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో దశాబ్దాల తర్వాత ఒక సంపూర్ణ మెజారిటీ కలిగిన స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే దేశాభివృద్ధి కోసం తనను ఆగనివ్వకుండా, అలసిపోనివ్వకుండా ముందుకు నడిపిస్తోందని మోదీ ఎమోషనల్ అయ్యారు.

## అలా చేస్తే చరిత్రలో కలిసిపోతారు: పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక

పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు కొనసాగిస్తే, భవిష్యత్తులో భౌగోళిక చిత్రపటంలో ఉండాలా? లేక చరిత్రలో కలిసిపోవాలా? అనేది పాకిస్థాన్ తేల్చుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలోని మానెక్‌షా సెంటర్‌లో 'యూనిఫాం అన్‌వీల్డ్' నిర్వహించిన 'సేనా సంవాద్' కార్యక్రమంలో జనరల్ ద్వివేది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతేడాది 'ఆపరేషన్ సిందూర్'కు దారితీసిన పరిస్థితులు మళ్లీ తలెత్తితే భారత సైన్యం ఎలా స్పందిస్తుందని ఆయన్ను ప్రశ్నించగా, పైవిధంగా ఘాటుగా బదులిచ్చారు. ఉగ్రవాదంపై భారత్ ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ఆయన మాటలు స్పష్టం చేశాయి. గతేడాది మే 7న పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత బలగాలు 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించాయి. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై మన సైన్యం కచ్చితమైన దాడులు చేసింది. దీనికి ప్రతిగా పాకిస్థాన్ కూడా దాడులు ప్రారంభించడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. సుమారు 88 గంటల పాటు కొనసాగిన ఈ సైనిక ఘర్షణ, మే 10న ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహనతో ముగిసింది. 'ఆపరేషన్ సిందూర్' మొదటి వార్షికోత్సవం జరిగిన కొద్ది రోజులకే ఆర్మీ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## దేశంలో పెరిగిన నిరుద్యోగం.. ఆరు నెలల్లో ఇదే అత్యధికం!

దేశంలో నిరుద్యోగిత రేటు మళ్లీ పెరిగింది. 2026 ఏప్రిల్ నెలకు గాను భారత నిరుద్యోగిత రేటు ఆరు నెలల గరిష్ఠ స్థాయి అయిన 5.2 శాతానికి చేరింది. మార్చిలో ఇది 5.1 శాతంగా ఉంది. అయితే, ఇదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం 12 నెలల కనిష్ఠానికి తగ్గడం గమనార్హం. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నెలవారీ బులెటిన్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈసారి నిరుద్యోగిత రేటు పెరుగుదలకు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలే కారణమయ్యాయి. గ్రామాల్లో నిరుద్యోగిత రేటు మార్చిలోని 4.3 శాతం నుంచి ఏప్రిల్‌లో 4.6 శాతానికి పెరిగింది. దీనికి భిన్నంగా, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం 6.8 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గింది. ఇది ఏప్రిల్ 2025 తర్వాత నమోదైన అత్యల్ప స్థాయి. పట్టణాల్లోని ఈ సానుకూలత ముఖ్యంగా మహిళల విషయంలో ఎక్కువగా కనిపించింది. పట్టణ మహిళల నిరుద్యోగిత రేటు మార్చిలోని 9.0 శాతం నుంచి ఏప్రిల్‌లో 8.5 శాతానికి తగ్గింది. ఇది కూడా ఏడాది కనిష్ఠం. అదేవిధంగా, పట్టణ పురుషుల నిరుద్యోగం 6.1 శాతం నుంచి 5.9 శాతానికి తగ్గింది. అయితే జాతీయ స్థాయిలో చూస్తే, మహిళలు ఇప్పటికీ ఉపాధి మార్కెట్లో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా మహిళల నిరుద్యోగిత రేటు మార్చిలోని 5.3 శాతం నుంచి ఏప్రిల్‌లో 5.4 శాతానికి పెరిగింది. పురుషుల నిరుద్యోగిత రేటు కూడా 5.0 శాతం నుంచి 5.1 శాతానికి స్వల్పంగా పెరిగింది. నిరుద్యోగం పెరగడంతో పాటు, కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్) కూడా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మహిళల కార్మిక భాగస్వామ్య రేటు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయి అయిన 33.9 శాతానికి పడిపోయింది. ఈ గణాంకాలు పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ ఉపాధి కల్పనలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని స్పష్టం చేస్తున్నాయి.

### సంతానం పెంచితే ఆర్థిక సాయం..

## చంద్రబాబు సంచలన ప్రకటన!

జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేల చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'పిల్లలే సంపద' పేరుతో త్వరలోనే ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. జనాభా తగ్గుదల రేటు ఆందోళన కలిగిస్తోందని, దేశ ప్రగతికి పిల్లలే అసలైన సంపద అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఆయన గుర్తుచేశారు. గతంలో కుటుంబ నియంత్రణపై దృష్టి సారించామని, కానీ మారిన పరిస్థితుల్లో జనాభాను దేశానికి సంపదగా మార్చేందుకు 'పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ'ని తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే 'తల్లికి వందనం' కింద రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, తల్లీబిడ్డలకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## ఈసారి ముందే రుతుపవనాలు.. కానీ 'ఎల్ నినో' గండం!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి మే 26నే తీరాన్ని పలకరించనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇటీవల ప్రకటించింది. మే 28 నాటికి పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఈ సానుకూల వార్తతో పాటే ఓ ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. ఎల్ నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ తన తొలి దశ అంచనాలో, జూన్-సెప్టెంబర్ మధ్య వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదై, సాధారణం కంటే తక్కువగా ఉంటుందని పేర్కొంది. రుతుపవనాలు ముందుగా రావడం, మొత్తం వర్షపాతానికి ప్రత్యక్ష సంబంధం ఉండదని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రుతుపవనాల సమయంలో ఏర్పడే అల్పపీడనాలపైనే వర్షపాతం ఆధారపడి ఉంటుందని ప్రైవేటు వాతావరణ సంస్థ 'స్కైమెట్ వెదర్' వైస్ ప్రెసిడెంట్ మహేష్ పాలవత్ వివరించారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్నే ఎల్ నినో అంటారు. దీనివల్ల భారత ఉపఖండం వైపుగా వచ్చే తేమ గాలులు తగ్గిపోయి, వర్షపాతం తగ్గుతుంది. ఈ ఏడాది మే-జూలై మధ్య ఎల్ నినో ఏర్పడేందుకు 82 శాతం అవకాశాలు ఉన్నాయని అంచనా. రుతుపవనాలు ముందుగా రావడం రైతులకు కొంత ఊరటనిచ్చే అంశమే అయినా, ఎల్ నినో ముప్పు నేపథ్యంలో వ్యవసాయం, నీటి నిల్వలు, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వారి స్వాతంత్ర్యం కోసం మేం పోరాడం

న్యూయార్క్: తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని , వారి స్వాతంత్ర్యం కోసం మేం పోరాడబోమని వ్యాఖ్యానించారు. "తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో, అమెరికాకు మాత్రం 15 వేల కిలోమీటర్లకుపైగా దూరంలో ఉంది. ఎక్కువ దూరం కావడంతో మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి" అని ఓ వార్తాసంస్థతో ట్రంప్ అన్నారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికాచైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్పష్టం చేసినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో



అమెరికా చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్పా... ప్రత్యర్థులుగా కాదని జిన్‌పింగ్ పేర్కొనడం గమనార్హం.

## భానుడి భగభగ

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మళ్లీ ఎండలు క్రమంగా పెరుగుతూ 45 డిగ్రీలకు చేరుతున్నాయి. శనివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాత్రి పూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకుపై నమోదవుతున్నట్టు గమనార్హం. మధ్యాహ్నం పూట వేడిగాల్పులు కూడా వీస్తున్నాయి. సాయంత్రం పూట కాస్త ఎండ తగ్గినప్పటికీ ఉబ్బరింపు అలాగే ఉంటున్నది. తీవ్ర ఉబ్బరంతో ఇండ్లలో ఉండలేని పరిస్థితి. అన్ని జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నమోదు అవుతుండటంతో వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. వచ్చే రెండు రోజుల్లో కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో 45 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉండటంతో ఆ జిల్లాలకు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా 30 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యధికంగా 31.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రామగుండం, కొత్తగూడెం, హైదరాబాద్ జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి.

వేగంగా విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. శనివారం నాడు ఆగ్నేయ అరేబియన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, నైరుతి బంగాళాఖాతం లోని చాలా ప్రాంతాలు, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల్లోకి ప్రవేశించినవి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఆ ప్రాంతాలన్నింటికి పూర్తిగా విస్తరించి తూర్పు బంగాళాఖాతంలోకి ప్రవేశించేలా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడి అల్పపీడనంగా మారింది. ఆదివారం రాష్ట్రంలోని ఒకటి రెండు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో శనివారం రాత్రి 9 గంటల వరకు 40 ప్రాంతాల్లో వర్షం పడింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 3.6 సెంటీమీటర్లు, మహ్మదాబాద్‌లో 3.5 సెంటీమీటర్లు, దేవరకద్రలో 3.0 సెంటీమీటర్ల చొప్పున వాన పడింది.

## మోడీ అసమర్థ పాలనకు నిదర్శనం

హైదరాబాద్ : పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సీఎం ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాల పై వ్యతిరేక ప్రభావం చూపుతుందనీ, నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్'లో పెట్టిన పోస్టు యథాతథంగా... ''మోడీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆత్మ నిర్భర్ భారత్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప, ఫలితాలు తెచ్చిన పాలసీ కాదని తేలిపోయింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలింది. గత పదేండ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోంది. ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరింది. ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే. ప్రపంచంలో భారత్ ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం "పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం" అని పదే పదే ప్రకటించింది. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటర్‌పై రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోడీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారు. ఇది విశ్వాస ఘాతుకం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాను''. అని పేర్కొన్నారు.

# రక్తదానం.. మహాదానం

* చెల్పూర్‌లో ఘనంగా మెగా రక్తదాన శిబిరం
* 57యూనిట్ల రక్తం సేకరణ




చెల్పూర్, ప్రజాస్ఫూర్తి: అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే రక్తదానం మహాదానంతో సమానమని జెన్కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ఊర్మిళ, ఫ్యాక్టరీ మేనేజర్ రఘుపతిలు అన్నారు. చెల్పూర్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో 'హెల్ప్ టు నీడీ' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కేటీపీపీ జెన్కో కానిస్టేబుల్స్ నిర్వహిస్తున్న ఈ సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో మొత్తం 57 యూనిట్ల రక్తం సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం క్రమబద్ధంగా సాగింది. జెన్కో కానిస్టేబుల్స్, ఉద్యోగులు, స్థానిక యువతతో పాటు సంస్థ ద్వారా లబ్ధి పొందిన పేద కుటుంబాల సభ్యులు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జెన్కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఊర్మిళ, ఫ్యాక్టరీ మేనేజర్ రఘుపతిలు రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మెగా రక్తదాన శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# సమయపాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

* పరేడ్‌ను పరిశీలించిన మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్



ప్రజాస్ఫూర్తి, మెదక్: మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన వారాంతపు పరేడ్‌ను మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పరేడ్‌లో పాల్గొని డ్రిల్ నిర్వహించారు. సిబ్బంది టర్నౌట్, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆయుధాల నిర్వహణ విధానాన్ని డీఎస్పీ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. శారీరక దృఢత్వం కోసం ప్రతి రోజు వ్యాయామం, డ్రిల్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడే విధంగా సిబ్బంది నడుచుకోవాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు లింగం, నరేష్, సుభాష్, భవాని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

జనగామ, ప్రజాస్ఫూర్తి: రెండు ద్వి చక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూరిపురం నుండి నర్సయ్యపల్లికి బైక్ పై వెళ్తున్న ఆళ్ల రామచరణ్, కాటిగల్ నుండి తరిగొప్పుల వైపు వస్తున్న చిరిగిరి రాహుల్ బైక్ లు రెండు ఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదం లో ఒకరు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతడి వాహనం పై వెనక కూర్చున్న నర్సాపూర్ కు చెందిన స్వాతిక్ గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రహదారి పై రైతుల ఆందోళన



జనగామ, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తూ రైతులు జనగామ హుస్నాబాద్ రహదారి పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గానుగపహాడ్ వడ్లకొండ క్రాస్ రోడ్డు వద్ద గానుగపహాడ్, కొత్రతండా, వడ్లకొండ తదితర గ్రామాలకు చెందిన రైతులు శనివారం నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రా ల్లో రెండు వారాలుగా ధాన్యం నిల్వ ఉండిపోయిందని, అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పటికీ బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో కేంద్రాల్లో భారీగా ధాన్యం పేరుకు పోయిందన్నారు. లారీల కొరత కారణంగా కొనుగోలు ప్రక్రియ పూర్తిగా నత్తనడకన సాగు తోందని ఆరోపించారు. రైతుల ఆందోళనతో రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోక లకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఆర్డీఓ గోపిరామ్, సీ.ఐ సత్యనారాయణ రెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకు ని రైతులతో చర్చించారు. ప్రతి రోజూ లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించే లా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# లయన్స్ క్లబ్ సెక్రటరీగా నగేష్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం సెక్రటరీగా 15వ డివిజన్‌కు చెందిన పగడాల నగేష్ నియమితులయ్యారు. 2026-27 సంవత్సరానికి గాను క్లబ్ జనరల్ బాడీ సమావేశంలో నగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ క్లబ్ అభివృద్ధికి చేసిన కృషికి గాను నగేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ సేవలను మరింత విస్తృతపరుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నగేష్‌ను క్లబ్ సభ్యులు అభినందించారు.

# బహుజనులు తమ సత్తాను చాటాలి

* బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



స్టేషన్ ఘన్పూర్: బడుగు,బలహీన వర్గాలైన బిసి, ఎస్సి,ఎస్టి మైనారిటీ, అగ్రవర్ణ పేదలు ఐక్యమత్యంతో ఉద్యమిస్తే రెండేళ్లలో బీసీ రాజ్యం రావడం తథ్యమని బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఐతవోని రాఘవేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధి లోని చాగల్లు లో బీసీ రాజ్యాధికార వేదిక పాదయాత్ర శనివారం అట్టహాసంగా కొనసాగింది. వివిధ పార్టీల నాయకులు, యువత, ప్రజలు పాదయాత్ర చేపడుతున్న రాఘవన్నకు తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో కౌన్సిలర్ పొన్నం రాజేష్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో రాఘవేంద్ర మాట్లాడుతూ మన బతుకులు మారాలన్నా, నిరుద్యోగ సమస్య అంతం కావాలన్నా, ప్రభుత్వ విద్యా, వైద్యం మెరుగుపడాలన్నా బీసీ రాజ్యం రావాలన్నారు. 8దశాబ్దాలుగా మన సమస్యలపై చెప్పులు అరిగేలా తిరిగిన అగ్రవర్ణ పాలకులు పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జనాభాలో 95శాతం ఉన్న మనం ఎందుకు అడుక్కోవాలని ప్రశ్నించారు. రిజర్వేషన్లు తెచ్చుకోవడం, బీసీ నిధులు సాధించుకోవడం,సబ్ ప్లాన్ ఏర్పాటు చేసుకోవడం మన చేతిలో లేదని, కానీ బీసీ రాజ్యాధికారం సాధించుకోవడం మన చేతుల్లోనే ఉందని గుర్తు చేశారు. బీసీలంతా ఐక్యంగా ముందుకు కదిలి రెండేళ్లలో బీసీ రాజ్యాన్ని సాధించుకోవాలని కోరారు. బిసి రాజ్యాధికారమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. నాలుగు రోజు చేపట్టిన ఈ పాదయాత్రకు గ్రామ, గ్రామాన ప్రజలు అందరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జనగామ జిల్లా కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, కౌన్సిలర్ పొన్నా రాజేష్, సీనియర్ నాయకులు చేపూరి ప్రభాకర్, పాదయాత్ర బృందం సభ్యులు డాక్టర్ విద్యా రాణి, లలిత, శివ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు, కలలు, చేతివృత్తుల పట్ల అభిరుచి పెంపొందించుకోవాలి

* జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్






నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల ను పురస్కరించుకొని శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్, క్రాఫ్ట్ ,కల్చర్ పై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి, కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, విద్యకు సంబంధించి అనేక పథకాలను తీసుకు వస్తున్నదని, విద్యార్థులకు యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, డైట్ చార్జీలు, మెనూను పెంచడం జరిగిందని, అన్ని సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు కామన్ మేనూను తీసుకురావచ్చి విద్యార్థుల పౌష్టికాహారాన్ని పెంపొందించేందుకు దృష్టి కేంద్రీకరించి నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక ఇటీవల ప్రభుత్వం కొత్త పథకాలను ప్రకటించిందని, వచ్చే విద్యా సంవత్సరం జూన్ లో ప్రారంభమైన తర్వాత పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని అందించనున్నట్లు ప్రకటించిందన్నారు. అంతేకాక ప్రతి నియోజకవర్గంలో ఒకే చోట 2500మంది విద్యార్థులు చదువుకునే విధంగా రూ.200కోట్లు వెచ్చించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని, ఈ పాఠశాలల్లో 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు చదువుకోవచ్చని, చదువుతోపాటు, క్రీడలు, ఇతర అన్ని రకాల నైపుణ్యాలు అభివృద్ధి పరుచుకునేందుకు ఈ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లులకు పట్టుదల ఎక్కువగా ఉంటుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులను పాఠశాలలకు తీసుకువెళ్లే ముందు తల్లిదండ్రులతో పాటు, పిల్లలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే పాఠశాల యాజమాన్యాలు స్కూల్ జోన్లను ఏర్పాటు చేసి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, రాష్ట్రప్రభుత్వం రోడ్డు భద్రతపై అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, చిన్నప్పటి నుండే రోడ్డు భద్రతపై పిల్లలకు అలవాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నల్గొండ జిల్లాలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని, రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా జిల్లాకు సంబంధించిన విద్యార్థులు వివిధ రకాల హోదాలలో ఉండటం గమనించాలని, ఈ గొప్పతనం తల్లులకు దక్కుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



# పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

* బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

ప్రజాస్ఫూర్తి, మెదక్: పార్టీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా నిలుస్తామని, కార్యకర్తల సంక్షేమం, గౌరవ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి భరోసా ఇచ్చారు. రామాయంపేట పట్టణ రాజకీయాల్లో యువతలో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో భారీగా యువకులు చేరారు. పట్టణానికి చెందిన సుమారు 50మందికి పైగా యువకులు బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై తిరుపతిరెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో అధికారికంగా చేరడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో హాజరై తిరుపతిరెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చైతన్యంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. పార్టీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా నిలుస్తామని, కార్యకర్తల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ వారికి పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట పట్టణానికి చెందిన మద్దూరి భానుచందర్, మార్కు సతీష్, సాగర్, ఎండి సల్మాన్, శ్రీకాంత్, దోమకొండ భాను, మెట్టు గణేష్, ఎరుపుల ప్రసాద్, గొల్లపర్తి ప్రసాద్, నువ్వుఆన్ సంజయ్, బన్నీ తదితర ముఖ్య నాయకులు, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

* ఖమ్మం జిల్లాకు ఆరు స్కాలర్‌షిప్‌ల కేటాయింపు

కూసుమంచి ప్రజా స్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ప్రకటించినట్లు ఖమ్మం జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతా చందర్ రావు తెలిపారు.రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాకు మొత్తం ఆరు స్కాలర్‌షిప్‌లు కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం దక్కే విధంగా ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో స్కాలర్‌షిప్ కేటాయించినట్లు పేర్కొన్నారు. కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి: ఖమ్మం నియోజకవర్గం - ఇంటర్, పాలేరు నియోజకవర్గం - 10వ తరగతి, మధిర నియోజకవర్గం - 10వ తరగతి, వైరా నియోజకవర్గం - ఇంటర్, సత్తుపల్లి నియోజకవర్గం - ఇంటర్, కల్లూరు -10వ తరగతి ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతా చందర్ రావు మాట్లాడుతూ,ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జీలు మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకుని పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, పూర్తి ప్రొఫార్మాలతో జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆయన సూచించారు. అలాగే ఎంపికైన విద్యార్థుల వివరాలను ముందుగా వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన వివరాలు లేదా సందేహాల కోసం 9848675736 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్వాయి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


TELANGANA RASHTRA ARYA VYSYA MAHASABHA Regd. No.363/2015
Vysya Bhavan, 6-2-648, Chintal Basti, Khairtabad, Hyderabad-500004
E-mail: tsavms@gmail.com, Ph: 040 - 23397038, 23317691

APPLICATION FORM

(For Merit Scholarships for the Academic Year 2025-2026)
For X and Intermediate Students only

Student Photo

Name of the Student :
(in Capital Letters) ______
Father's Name in full : ______
Address for Correspondence : ______
Mobile Number : ______ E-mail ID : ______
Gothrams : 1. ______ 2. ______
Course Completed : X / Intermediate: ______
Institution Studied ______
(Bonafide Certificate should be enclosed)
Marks secured : X Class : ______ H.T.No. : ______
(Memo should be enclosed) Intermediate : ______ H.T.No. : ______
Recommendation letter from Local Arya Vysya Sangham / District Sangham on letter head.

Signature of the Parent Signature of the Student

Note: Enclose the photo copies (Xerox Copies) - wherever indicated to substantiate your statement. Go through the application form carefully and fill.

For Office Use

President Chairman: Educational Fund Committee General Secretary
Amount Sanctioned : Rs.
Cheque No.: ______ Bank-Branch ______

# మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల




భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి: మానవ అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల అన్నారు. భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని సఖి సెంటర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల ఉద్యోగాలు, అధిక జీతాలు, మంచి భవిష్యత్తు పేరుతో మహిళలు, చిన్నారులను మోసం చేసే మానవ అక్రమ రవాణా ముఠాలపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ వంటి నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి మహిళ, చిన్నారి తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వెనుకబడిన పరిస్థితులను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం పెరిగితేనే ఇటువంటి నేరాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి. శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సి.డి.పి.ఓ. రాధిక, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ అసిస్టెంట్ జి. సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి

* జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్: జనగణన 2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, జనాభా గణన, గృహ బాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. రామాయంపేట మండలం అక్కన్నపేట్ గ్రామంలో జనగణన 2027 ఇండ్ల లెక్కింపు కార్యక్రమాన్ని శనివారం క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించారు. ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ స్వయం గా పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన వివరాలను అందించాలని సూచించారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయాని,ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్ రజిని, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా బక్రీద్ జరుపు కోవాలి

* డీసీపీ రాజమహేంద్ర నాయక్




జనగామ, ప్రజాస్ఫూర్తి: బక్రీద్ పండుగను శాంతియుతం గా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని ముస్లిం సమాజ సభ్యులను డీసీపీ రాజమహేంద్ర నాయక్ కోరారు. శనివారం రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్థానిక పోలీస్ స్టేషన్ లో డీసీపీ రాజమహేందర్ నాయక్ ఆధ్వర్యంలో, సీఐ సత్యనారాయణ రెడ్డి సమక్షం లో ముస్లిం సమాజ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవడం, సామరస్యాన్ని కాపాడుకోవడం, చట్టాలు, నిబంధనలు పాటించ డం వంటి అంశాల పై విస్తృతంగా చర్చించారు.డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ జంతు వుల బలి కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలు, ప్రకారం మాత్రమే నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి పోలీసు, వెటర్నరీ, రవాణా శాఖ అధికారు లతో సమీకృత చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తారని, పశువుల అక్రమ రవాణాను నిరోధించి, పట్టుబడిన పశువులను దగ్గర లోని గోశాలల కు తరలించాలని ఆదేశించారు. కట్టుదిట్టమైన పర్య వేక్షణ చేపట్టి, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా జరిమానా లేదా 3 నెలలు జైలు శిక్ష విధించ డం జరుగుతుందని తెలిపారు. సీ.ఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసు శాఖకు సహక రించాలని కోరారు. బక్రీద్ పండు గ ను ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేం దుకు తగిన బందోబస్తు, నిఘా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, ముస్లిం సమాజ సభ్యులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణ ర్యాలీ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జగదీష్ తొలుత యూపీహెచ్‌సీని పరిశీలించి, సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటర్ పరిధిలోని ప్రజల ఆరోగ్య రక్షణకు ఎన్‌సీడీ స్క్రీనింగ్ ఎంతో కీలకమన్నారు. కేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం లతో ప్రత్యేకంగా సమావేశమై, ప్రస్తుతం జరుగుతున్న స్క్రీనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు ఎంత శాతం నిర్ధారణ రేటు వస్తోందని, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బాధితుల వివరాలను ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్య సేవలు మరియు మందులు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ దినేష్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి. హరికిషన్, పీహెచ్ఎం శ్రీనివాసరావు, నర్సింగ్ ఆఫీసర్ శంకరమ్మ, ఫార్మసిస్ట్ దిలీప్, ల్యాబ్ టెక్నీషియన్ ఎం. స్పందన, హెల్త్ సెంటర్ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోయిస్టులకు రూ.55.60 లక్షల రివార్డులు

**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరిన మావోయిస్టు పార్టీకి చెందిన 10మంది సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.55.60 లక్షల రివార్డులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం చెక్కుల రూపంలో అందజేశారు. లొంగిపోయిన వారి క్యాడర్ ఆధారంగా ప్రభుత్వం రివార్డులను మంజూరు చేసింది. రివార్డులు అందుకున్న వారిలో ఒక స్టేట్ కమిటీ సభ్యుడు, ఒక డివిజనల్ కమిటీ సభ్యుడు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఇద్దరు దళ సభ్యులున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వారి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రివార్డు నగదును విలాసాలకు కాకుండా జీవనోపాధికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులు చేపడుతున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు. పునరావాసంతో పాటు ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్నిరకాల ప్రయోజనాలను కల్పిస్తున్నామని తెలిపారు.

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

* **అమావాస్య సందర్భంగా హోమం గోపూజ, నవగ్రహ పూజల్లో పాల్గొన్న భక్తులు**
* **భక్తులకు అన్నదానం చేసిన జాండగూడెం రామకృష్ణ, అశ్విని దంపతులు**



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్: షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శని త్రయోదశి అమావాస్యలను పురస్కరించుకొని దేవాలయంలో నవగ్రహ పూజలు హోమం గోపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు అందే బాబయ్య పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తూరు గ్రామానికి చెందిన జండగూడెం రామకృష్ణ గౌడ్ అశ్విని దంపతులు దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన జాండగూడెం రామకృష్ణ అశ్విని లకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మండువేసవిలో భక్తుల దాహార్తి తీర్చేందుకు దాత బొట్టు రమేష్ మిత్ర బృందం చల్లని మంచినీటిని భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, మంచిరేవుల అశోక్, నార్య నాయక్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, క్యూసెట్ శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలని ధర్నా



ప్రజాస్ఫూర్తి, జన్నారం: మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన రైతులు శనివారం రోజున మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రోటిగూడ లోని కొనుగోలు కేంద్రం వద్ద మొక్కజొన్న లను పోసి నెల రోజులు గడుస్తున్నా అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతుల ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ ను స్వయంగా కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# ఆగని ఆగడాలు.. అసాంఘీక శక్తులకు అడ్డా..!

* **ఓపెన్ బార్‌గా మారిన తెలంగాణ క్రీడా ప్రాంగణం**
* **ప్రారంభించకుండానే శిథిలమవుతున్న క్రీడావస్తువులు**
* **రూ.1.35 కోట్ల అభివృద్ధి నిధులు వృథా..**
* **కార్పొరేషన్‌గా మారినా పట్టించుకోని అధికార యంత్రాంగం**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోజురోజుకూ ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయి... క్రీడా ప్రాంగణాన్ని మందుబాబులు తమ అడ్డాగా మార్చుకుని రెచ్చిపోతున్నారు. అసాంఘీక శక్తులు రాజ్యమేలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిద్రావస్థను వీడటంలేదు. ఆరోగ్యంతోపాటు ఆహ్లాదం కోసం ఏర్పాటు చేయతలపెట్టిన తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తికావడంలేదు. మున్సిపాలిటీ హోదా నుంచి కార్పొరేషన్ హోదా దక్కినా పనుల్లో వేగం మాత్రం పుంజుకోవడంలేదు. ఫలితంగా అభివృద్ధి పేరుతో రూ.1.35 కోట్లతో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలు ప్రారంభం కాకుండానే శిథిమలవుతుండటంతో నిధులన్నీ వృథా అవుతున్నాయి. ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ రామవరంలోగల శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ క్రీడా ప్రాంగణం దీనగాథ. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చిటికెలో చేపట్టే కాంట్రాక్టర్లు ప్రజలకు నిరంతరం ఉపయోగపడే క్రీడా ప్రాంగణం ఏర్పాటులో జాప్యం, అలసత్వం వహిస్తున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదు. పనులు నత్తనడకన సాగుతుండటంతో సమీపంలోగల వైన్ షాపుల్లో మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబులు క్రీడా ప్రాంగణాన్ని అడ్డాగా మార్చుకుని ఓపెన్ బార్‌గా మార్చేశారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ క్రీడా ప్రాంగణానికి పునాదులు పడినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ పనులు ఇంకా కొనసా.... గుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్ నిర్మించగా, అనంతరం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా పనులు వేగవంతం అవుతాయని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. కొంతకాలం వరకు పనులు నిలిచిపోవడంతో ఆ ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయి విషసర్పాలు, పురుగుల కారణంగా స్థానికులు భయాందోళనకు గురవుతుండటంతో 'ప్రజాస్ఫూర్తి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు పిచ్చిమొక్కలను తొలగించి పనుల్లో వేగం పెంచుతామని స్థానికులకు హామీ ఇచ్చారు. కాని ఆ హామీ నీటిమూటగానే మిగిలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

*** ఓపెన్ బార్‌ను తలపిస్తున్న క్రీడా ప్రాంగణం**

తెలంగాణ క్రీడా ప్రాంగణం ప్రస్తుతం క్రీడల కంటే మందుబాబులకే ఎక్కువ ఉపయోగపడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా మద్యం సేవించే వారు మందుసీసాలు తెచ్చుకుని బహిరంగంగా మద్యం తాగుతున్నారు. మద్యంప్రియులు తాగేసిన ఖాళీ మద్యం సీసాలను అక్కడే వదిలేయడంతోపాటు కొందరు ఆకతాయిలు వాటిని పగులగొడుతున్నారు. దీంతో పగిలిన గాజు ముక్కలతో అక్కడికి వచ్చే పిల్లలు, వాకింగ్ చేసే వారికి గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. ప్రధాన ద్వారానికి తాళాలు లేకపోవడంతో కొందరు వ్యక్తులు అక్కడే మలమూత్ర విసర్జన చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రాంగణం పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని చెబుతున్నారు.

*** ఇప్పటికే శిథిలమైన వాకాంగ్ ట్రాక్**

గతంలో నిర్మించిన వాకింగ్ ట్రాక్ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిని కనిపిస్తోంది. వివిధ నిర్మాణ పనుల పేరుతో ట్రాక్టర్లు, జేసీబీలు ప్రాంగణంలోకి రావడంతో ట్రాక్ శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు వాపోతున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన ట్రాక్ ఇలా ధ్వంసం కావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. అంతేకాక లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభం కాకముందే పెచ్చులూడిపోయింది. నాసిరకం పనులకు నిదర్శనంగా ఇది నిలుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొక్కుబడిగా, నాసిరకంగా, నిర్లక్ష్యంగా పనులు చేపట్టినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రూ. కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణంలోని వస్తువులు ప్రారంభం కాకుండానే ధ్వంసమవుతుండటంతో 'బిల్లుల'కోసమే పనులు చేస్తున్నారు తప్ప ప్రజల కోసం కాదనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. నాసిరకంగా చేసిన పనులపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారా... లేక మనకెందుకులే... మన చేతులు తడిచాయని ఊరుకుంటారా అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతుంది.







*** సెక్యూరిటీ గార్డు గది ఉన్నా... గార్డు లేడు..!**

తెలంగాణ క్రీడా ప్రాంగణంలో సెక్యూరిటీ గార్డు గది నిర్మించినప్పటికీ ఇప్పటివరకు సిబ్బందిని నియమించకపోవడం వల్ల అది వృథాగా ఉంది. దీంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇటీవల ప్రజలు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను కూడా ధ్వంసం చేసిన ఘటన స్థానికుల్లో ఆగ్రహం రేపుతోంది. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళలో మరింత చిమ్మ చీకటి అలుముకుని అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడే వారికి అనుకూలంగా మారింది. గతంలో అధికారులు ఇక్కడ వీధి లైట్లు, సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి, సెక్యూరిటీ గార్డును నియమిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతే కాకుండా ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ పనులు నిలిచిపోవడంతో అక్కడ నిల్వ ఉంచిన ఇసుక, కంకర, ఇనుమును దొంగలు ఎత్తుకెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

*** అధికారులు, ప్రజా ప్రతినిధుల హామీలు అమలయ్యేనా..!**

గతంలోనూ ఈ ప్రాంతంలో అసాంఘీక కార్యకలాపాలు జరగడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో క్రీడా ప్రాంగణాన్ని త్వరితగతిన అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, సీసీ కెమేరాలు, సెక్యూరిటీ గార్డును కూడా నియమిస్తామని, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాని రోజులు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు ఉన్నాయి. ఇటీవల 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ కూడా ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం మందుబాబులకు కాకుండా సామాన్య ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో వేచి చూడాలి మరి.

# షాద్‌నగర్‌లో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలు చేస్తున్న ముగ్గురు అరెస్ట్

* **బంగారం, వెండి ఆభరణాలు, నగదు, బైక్ స్వాధీనం – మరో మూడు చోరీ కేసులు వెలుగులోకి**
* **ప్రెస్ మీట్ లో వెల్లడించిన పోలీసు అధికారులు**







ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్: షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్లు మరియు చోరీకి ఉపయోగించిన హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షాద్‌నగర్ జీ హెచ్ ఆర్ కాలనీకి చెందిన కుక్కలి సురేష్ తన భార్య అనారోగ్యంతో 7వ తేదీన ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లగా, 9వ తేదీన తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు, బెడ్‌రూమ్ బీరువాల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. దీనిపై షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు రోహిత్ కుమార్, శివమ్ సింగ్, సాగర్ కుమార్ రవిదాస్ అనే ముగ్గురు నిందితులను 16వ తేదీన అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులు మేడ్చల్ ప్రాంతంలో చోరీ చేసిన హోండా షైన్ బైక్‌పై షాద్‌నగర్‌కు వచ్చి జీ హెచ్ ఆర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని చోరీ చేసినట్లు వెల్లడించారు. చోరీ చేసిన కొంత బంగారం, వెండి వస్తువులను షాద్‌నగర్ ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తికి రూ.40వేలకి విక్రయించి వచ్చిన డబ్బును ముగ్గురు పంచుకున్నట్లు తెలిపారు. మిగిలిన వస్తువులను తరువాత అమ్మాలని దాచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇదే కాకుండా షాద్‌నగర్ పరిధిలోని ఫార్చున్ కాలనీ, సీ ఎస్ కే రోడ్ న్యూ రాఘవేంద్ర కాలనీ ప్రాంతాల్లో, మేడ్చల్ పరిధిలో మరో చోట కూడా చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రూ.20వేల నగదు, హోండా షైన్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, వెండి కాళ్ల కడియాలు, వెండి పట్టగొలుసులు, బంగారు చెవి కమ్మలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, షాద్‌నగర్ డీసీపీ సిహెచ్ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ కె.సీతారాం పర్యవేక్షణలో డీఎస్ఐ శివరెడ్డి ఆధ్వర్యంలో క్రైమ్ టీమ్ ఈ కేసును ఛేదించింది. కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల చేతిలో అంతర్రాష్ట్ర సైబర్ మోసగాళ్ల ముఠా అరెస్ట్




సైబరాబాద్ ప్రజాస్ఫూర్తి: ఫిషింగ్, సిమ్‌స్వాప్, ఓటీపీ డైవర్షన్ ద్వారా రూ.77.75లక్షల సైబర్ మోసానికి పాల్పడిన ఆరుగురు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాము సిటీబ్యాంక్ అధికారులమని చెప్పి బాధితులను ఈసిమ్ నుంచి ఫిజికల్ సిమ్‌కు మార్చించి, మాల్వేర్ ఉన్న మొబైల్ ఫోన్లు పంపించి ఓటీపీలు డైవర్ట్ చేసి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కాజేశారు. నిందితుల వద్ద నుంచి రూ.15లక్షల నగదు, పలు మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని పోలీసులు హెచ్చరించారు.

# ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్ రెడ్డికి ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం



భువనగిరి ప్రజాస్ఫూర్తి: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విద్యా విజయోత్సవం కార్యక్రమం సందర్భంగా ముఖ్య అతిథి గా విచ్చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కి కార్యక్రమ అనంతరం జిల్లా ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎస్ జి టి ల సమస్యల గురించి ముఖ్యంగా తెలుగు, హిందీ, పిజికల్ డైరెక్టర్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ గురించి వినతి పత్రం అందజేశారు అనంతరం అట్టి విషయం గురించి ఎమ్మెల్సీ స్పందిస్తూ త్వరలో ప్రత్యామ్నాయం ఆలోచన చేస్తున్నాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుంట్ల అమరేందర్ రెడ్డి, గడసంతుల మధు, ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల శ్రీనివాస్, ఎస్ జి టి యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, బత్తుల దశరథ, ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు కల్లూరి రమేష్, యడవెల్లి బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును కలిసిన ఎమ్మెల్యే కుంభం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలోని బస్వాపురం ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు ఆర్& ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేయాలని కోరుతూ శనివారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ విషయంపై సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

# సాంస్కృతిక పోటీలలో అక్కపెల్లి గూడ విద్యార్థుల ప్రతిభ



ప్రజాస్ఫూర్తి, జన్నారం: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో జన్నారం మండలంలోని అక్కపెల్లి గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కోలాటం లో ప్రథమ స్థానం మరియు లంబడా నృత్యంలో ద్వితీయ స్థానం సాధించారు. అజ్మీర కీర్తన, ముద్రకోల శివాని, దారాజుల శ్రావణి జిల్లా విద్యాధికారి యాదయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను మండల విద్యాధికారి విజయకుమార్ అభినందించారు. ప్రథమ, ద్వితీయ స్థానాన్ని పొందడానికి కృషిచేసిన డ్యాన్స్ మాస్టర్ వంశీని ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్, కరుణ, ఏఏ పీ ఎస్సీ ఛైర్మెన్ రమాదేవిలు అభినందించారు.

# అంతర్జాతీయ మార్కెట్ల ఎఫెక్ట్..

**దిగివస్తున్న బంగారం, వెండి ధరలు.. ఒక్కరోజే రూ15 వేలు తగ్గిన వెండి..!**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మార్కెట్లలోని పరిణామాల ప్రభావంతో దేశీయంగా బంగారం, వెండి ధరలు దిగివస్తున్నాయి. దేశీయ బులియన్ మార్కెట్‌లో ఇవాళ కూడా బంగారం, వెండి ధరలు నేలచూపులు చూశాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం లాంటి అంశాలు దేశంలో పసిడి, వెండి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఈ విలువైన లోహాల ధరలు మరోసారి భారీగా తగ్గాయి.

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన సమాచారం ప్రకారం.. శనివారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో ధరలు గణనీయంగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980 తగ్గి రూ.1,56,930కి పడిపోయింది. అదేవిధంగా 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.900 తగ్గి రూ.1,43,850 వద్ద స్థిరపడింది. బంగారం బాటలోనే వెండి ధర కూడా నడిచింది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధరపై ఏకంగా రూ.15,000 మేర పతనం నమోదైంది. ఈ భారీ తగ్గుదలతో ఇవాళ కిలో వెండి ధర రూ.2.9 లక్షలకు దిగివచ్చింది. గ్లోబల్ మార్కెట్‌లోని మార్పులే దేశీయంగా ధరల తగ్గుదలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!




**న్యూఢిల్లీ:** భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పైన రూ.10 వరకు పెరిగే అవకాశముందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పెంపు ఒకేసారి లేదా దశలవారీగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంచుతూ శుక్రవారం భారత చమురు రంగ కంపెనీలు నిర్ణయించాయి. సమీప భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తత కారణంగా రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడేందుకు రూ.3 పెంచాయని, కానీ ఈ పెంపు చాలదని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు వారాల్లో దశలవారీగా పెరుగుదల ఉండవచ్చని అన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును దాదాపు నిలిపివేసింది. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కూడా లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని భరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు ఇంధన ధరలు పెంచుతున్నాయి. నిన్న పెరిగిన స్వల్ప పెరుగుదల కూడా కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప తొలగించలేదు.

## స్టాక్ మార్కెట్లలో భారీ పతనం..

**రెండో వారమూ భారీ నష్టాలు**

**వరుసగా రెండో వారం భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు**

**2000 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్.. 532 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు, పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలే ప్రధాన కారణం**

**అత్యధికంగా నష్టపోయిన రియల్టీ, ఐటీ రంగాల షేర్లు**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారం కూడా భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో సూచీలు కుప్పకూలాయి. ఈ వారంలో సెన్సెక్స్, నిఫ్టీలు 2 శాతానికి పైగా నష్టపోయాయి.

శుక్రవారంతో ముగిసిన వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 2.7 శాతం (2,000 పాయింట్లకు పైగా) క్షీణించి 75,238 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 2.2 శాతం (532 పాయింట్లు) నష్టపోయి 23,643.5 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లపై ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. మిడ్-క్యాప్ సూచీ 2 శాతానికి పైగా పడిపోగా, స్మాల్-క్యాప్ సూచీ ఏకంగా 4 శాతం నష్టపోయింది.

రంగాలవారీగా చూస్తే, రియల్టీ రంగం అత్యంత దారుణంగా దెబ్బతింది. బీఎస్ఈ రియల్టీ ఇండెక్స్ ఏకంగా 8 శాతం కుప్పకూలింది. ఐటీ రంగ షేర్లు కూడా 5.7 శాతం పతనమయ్యాయి. వీటితో పాటు ఆటో, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, పీఎస్‌యూ షేర్లు సైతం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయితే, ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ మెటల్, హెల్త్‌కేర్ వంటి కొన్ని రంగాలు స్వల్పంగా లాభపడ్డాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 105-110 డాలర్ల స్థాయిలో ఉండటం, డాలర్ బలపడటం వంటి కారణాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) అమ్మకాలకు మొగ్గుచూపుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నప్పటికీ, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ), రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి మార్కెట్లకు మద్దతు లభిస్తోంది. ముఖ్యంగా ఏప్రిల్‌లో సిప్ ద్వారా రికార్డు స్థాయిలో రూ. 31,115 కోట్ల పెట్టుబడులు రావడం మార్కెట్లకు కొంత ఊరటనిచ్చింది.

# అలెన్, రఘువంశీ విధ్వంసం..

**గుజరాత్‌పై విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో కోల్‌కతా..!**

**కోల్‌కతా:** పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ నిలిచింది. గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్‌కు షాకిస్తూ కీలకమైన రెండు పాయింట్లు సాధించింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో ఫిన్ అలెన్(93), రఘువంశీ(82 నాటౌట్)లు తుఫాన్ ఇన్నింగ్స్‌తో 247 రన్స్ కొట్టిన కోల్‌కతా.. ఆపై ప్రత్యర్థిని కట్టడి చేసింది. శుభ్‌మన్ గిల్(85), బట్లర్() అర్ధశతకాలతో పోరాడినా సరిపోలేదు. ఈ విజయంతో రహానే బృందం ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది.




ఐపీఎల్ 19లో ప్లే ఆఫ్స్ రేసు రోజురోజుకు ఆసక్తికరంగా సాగుతోంది. ఇక కష్టమే అనుకున్న జట్లు సంచలన విజయాలతో ముందున్న జట్లకు షాకిస్తున్నాయి. మొన్న ముంబై ఇండియన్స్, నిన్న లక్నో సూపర్ జెయింట్స్ .. ఈరోజు కోల్‌కతా నైట్ రైడర్స్ సూపర్ విక్టరీతో నాకౌట్ పోరును ఉత్కంఠగా మార్చేశాయి. తొలుత గుజరాత్ బౌలర్ల భరతం పడుతూ ఓపెనర్ ఫిన్ అలెన్(93), రఘువంశీ(82 నాటౌట్)లు భారీ స్కోరందించగా.. అనంతరం బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు.

భారీ ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్(23) శుభ్‌మన్ గిల్(85) దూకుడుగా ఆడారు. కానీ, బంతి చేతికి తగిలి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. నిశాంత్ సింధు(1)ను నరైన్ ఔట్ చేశాడు. జోస్ బట్లర్(57) గిల్ గెలుపు బాధ్యత తీసుకున్నారు. బౌండరీలతో చెలరేగిన కెప్టెన్ 33 బంతుల్లో అర్ధ శతకం అందుకోగా.. బట్లర్ సైతం బాదేశాడు. శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని నరైన్ విడదీశాడు. అప్పటికీ గుజరాత్ విజయానికి 22 బంతుల్లో 71 పరుగులు కావాలి. తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన సుదర్శన్, బట్లర్‌తో కలిసి ప్రయత్నించినా గుజరాత్‌ను గెలిపించలేకపోయాడు. చివరి ఓవర్లో 40 రన్స్ అవసరమవ్వగా.. గుజరాత్ 218కే పరిమితమైంది.

### అలెన్, రఘువంశీ వీరబాదుడు

కోల్‌కతాను ఆదిలోనే దెబ్బకొట్టాడు సిరాజ్. ఓపెనర్ రహానే(14)ను బౌల్డ్ చేసి గుజరాత్‌కు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత ఫిన్ అలెన్(93) రెచ్చిపోయాడు. రషీద్ ఖాన్ ఓవర్లో తొలి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. 14, 33 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద లైఫ్ లభించడంతో అర్ధ శతకం బాదేసి రఘువంశీ(82 నాటౌట్)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.

హోల్డర్‌ను రెండు సిక్సర్లతో అరుసుకోగా 9 ఓవర్లకు స్కోర్ వంద అయింది. తుఫాన్ ఇన్నింగ్స్ ఆడిన అలెన్ 12వ ఓవర్లో సిక్సర్ కొట్టబోయి బౌండరీ వద్ద రషీద్ క్యాచ్ పట్టగా




ఔటయ్యాడు. అలెన్ ఔటైనా రఘువంశీ జతగా గ్రీన్ (52 నాటౌట్) దంచాడు. డెత్ ఓవరల్లో వీరిద్దరి విధ్వంసంతో కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 247 పరుగులు కొట్టింది.

# సంచలన విజయంతో ఫైనల్లో సాత్విక్ - చిరాగ్..

**భారత్‌కు పతకం ఖరారు..!**

**థాయ్‌లాండ్:** థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆరంభం నుంచి అదరగొడుతున్న ఈ జోడీ సంచలన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం సెమీఫైనల్లో అద్భుత ఆటతో మలేషియా జంటపై చెక్ పెట్టిన సాత్విక్ -- చిరాగ్ జోడీ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఈ సీజన్‌లో వీరికి ఇదే మొదటి ఫైనల్ కావడం విశేషం. ఫేవరెట్లు పీవీ సింధు, లక్ష్య సేన్ నిష్క్రమించినా భారత్‌కు పతకం ఖాయం చేసిందీ జోడీ.



భారత స్టార్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి మరో టైటిల్‌కు చేరువైంది. థాయ్‌లాండ్ ఓపెన్ సెమీఫైనల్లో తొలిసెట్ కోల్పోయినా.. సంచలన ఆటతో ఫైనల్ బెర్తు దక్కించుకుంది. మలేషియా షట్లర్లు గోహ్ జే ఫేయ్, నుర్ ఇజుదీన్ 21-19తో తొలి సెట్‌లో ఆధిక్యం చెలాయించినా భారత జంట కుంగిపోలేదు. రెండో సెట్‌లో గొప్పగా పుంజుకున్న సాత్విక్ -- చిరాగ్ ద్వయం 22-20తో ప్రత్యర్థికి షాకిచ్చింది.

అదే ఊపులో నిర్ణయాత్మక మూడో సెట్‌ను 21-16తో కైవసం చేసుకొని ఫైనల్‌కు దూసుకెళ్లింది. థాయ్‌లాండ్ ఓపెన్‌లో వీరికి ఇది మూడో టైటిల్ పోరు. గతంలో 2019, 2024లో ఫైనల్ ఆడారు. తుది పోరులో లియో రాలీ -- డానియల్ మార్టిన్(ఇండోనేషియా) లేదా హి జి టింగ్ -- రెన్ గ్జియాంగ్ యూ(చైనా) జంటను సాత్విక్ -- చిరాగ్ ద్వయం ఢీకొట్టనుంది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, పురుషుల సింగిల్స్ నుంచి లక్ష్య సేన్, కిదాంబి శ్రీకాంత్ నిష్క్రమించిన విషయం తెలిసిందే.

# కెప్టెన్‌గా ఫాతిమా సనా..

**ఐదుగురికి తొలిసారి ప్రపంచకప్ ఛాన్స్..!**

**ఇస్లామాబాద్:** పదో సీజన్ మహిళల పొట్టి వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. ముక్కోణపు సిరీస్‌ను, ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఫాతిమా సనా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని సెలెక్టర్లు ఎంపిక చేశారు. సీనియర్లతో పాటు ప్రతిభావంతులైన జూనియర్లకు ప్రాధాన్యమిచ్చారు. అంతేకాదు రిజర్వ్ ప్లేయర్లుగా ఏకంగా ఆరుగురిని పాక్ బోర్డు తీసుకుంది.

వన్డే ప్రపంచకప్‌లో పాక్‌ను నడిపించిన ఫాతిమా సనా పొట్టి కప్‌లోనూ కెప్టెన్‌గా ఎంపికైంది. సీనియర్లు మునీబా అలీ, అలియా రియాజ్, సదియా ఇక్బాల్, డయానా బైగ్, తస్మియా రుబబ్, తుబ హసన్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. అండర్ -19 క్రికెట్‌లో అదరగొట్టిన ఇమన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జుబీన్‌లు మొదటిసారి ప్రపంచకప్ ఆడబోతున్నారు. ఈ పదిహేను మంది పోను.. ఆరుగురు రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపికయ్యారు.

పాకిస్థాన్ స్క్వాడ్ : ఫాతిమా సనా(కెప్టెన్), అలియా రియాజ్, అయేషా జఫర్, డయానా బైగ్, ఎమన్ ఫాతిమా, గుల్ ఫెరోజా, ఇరామ్ జవేద్, మునీబా అలీ(వికెట్ కీపర్), నష్రా సంధు, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సడియా ఇక్బాల్, సైరా జబీన్, తస్మియా రుబబ, తుబ హసన్. రిజర్వ్ ప్లేయర్లు -- అంబర్ కైనత్,




మొమినా రియాసత్, సడాఫ్ షమాస్, సిద్రా అమిన్, సైయదా అరూబ్, ఉమే హనీ.

జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా టీ20 వరల్డ్‌కప్ మొదలవ్వనుంది. అంతకంటే ముందు ఐర్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్ ముక్కోణపు సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ మూడు జట్ల మధ్య డబ్లిన్‌లో మే 28 నుంచి జూన్ 4 వ తేదీ ఈ సిరీస్ జరుగనుంది.

ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ జూన్ 14న భారత జట్టును ఢీకొట్టనుంది. జూన్ 17న దక్షిణాఫ్రికాతో, జూన్ 20 వ తేదీన బంగ్లాదేశ్‌తో, జూన్ 23న ఆస్ట్రేలియా, జూన్ 27వ తేదీన నెదర్లాండ్స్‌తో పాక్ తలపడనుంది.

# రసవత్తరంగా ప్లే ఆఫ్స్ రేసు..

**చెన్నై, ఢిల్లీ, కోల్‌కతాకు కష్టమే..!**

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ రేసు ఉత్కంఠ రేపుతోంది. నాకౌట్ పోటీలో లేని జట్లు పోతూపోతూ టాప్‌లోని జట్లకు షాకిస్తుండడంతో సమీకరణాలు మారిపోతున్నాయి. నాలుగు బెర్తులకు ఎనిమిది జట్లు పోటీలో నిలవగా.. లీగ్ దశలో 11 మ్యాచులే మిగిలాయి. ఈ పరిస్థితుల్లో ముందంజ వేయాలంటే.. ప్రతి మ్యాచ్ చావోరేవో. ఈ నేపథ్యంలో టాప్-2లోని గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్‌కు ఒక్క విజయం చాలు. కానీ, సన్‌రైజర్స్ హైదారబాద్.. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ రెండింటా గెలవాల్సి ఉంటుంది. అయితే.. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా, ఢిల్లీ క్యాపిటల్స్ భారీ తేడాతో గెలవడమే కాకుండా ఇతర మ్యాచ్‌ల ఫలితాల ఆధారంగా ప్లే ఆఫ్స్ చేరే అవకాశముంది.

పంతొమ్మిదో సీజన్ లీగ్ దశ ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది. వరుసగా ఆరు విజయాలతో టాప్‌లో కొనసాగిన పంజాబ్ కింగ్స్ ఆశ్చర్యంగా.. ఐదు ఓటములతో ప్లే ఆఫ్స్ అవకాశాల్ని సంక్లిష్టం చేసుకుంది. ఆరంభంలో నిరాశపరిచిన గుజరాత్ టైటాన్స్ వరసగా ఐదింటా గెలుపొంది టాప్‌లో కూర్చుంది. ప్రస్తుతం 16 పాయింట్లతో ఉన్న గుజరాత్ మరొక్క మ్యాచ్ గెలిస్తే దర్జాగా ప్లే ఆఫ్స్ చేరుతుంది. శనివారం కోల్‌కతాను ఓడిస్తే చాలు శుభ్‌మన్ గిల్ సేన ముందుకెళ్తుంది.

ఒకవేళ కోల్‌కతా చేతిలో, ఆపై మే 21న చెన్నై చేతిలోనూ ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమంచే అవకాశమూ ఉంది. అయితే.. రెండింటా ఒక్కటి గెలిచినా 18 పాయింట్లు వస్తాయి. ఒకవేళ గుజరాత్ ఒక మ్యాచ్ ఓడితే ఆర్సీబీ, రాజస్థాన్, సన్‌రైజర్స్ కూడా 18 పాయింట్లతో ఉండాలి. అప్పుడు రాజస్థాన్ మూడింటా గెలవాలి. ఆర్సీబీ.. పంజాబ్‌ను ఓడించి సన్‌రైజర్స్ చేతిలో ఓడాలి. చెన్నైపై కమిన్స్ సేన గెలవాలి. అప్పుడు.. నెట్‌రన్ రేటు




మెరుగ్గా ఉన్న జట్టు క్వాలిఫయర్ 1కు దూసుకెళ్తుంది.

### టాప్‌లోకి వెళ్లాలంటే..

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకి ఇంకా రెండు మ్యాచులే మిగిలాయి. ప్రస్తుతం 16 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన బెంగళూరు ఒక్క విజయంతో ముందుకెళ్తుంది. పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై గెలిస్తే.. 20 పాయింట్లతో టాప్‌లో ఉంటుంది.

అలాకాకుండా పంజాబ్, సన్‌రైజర్స్ చేతిలో ఓడితే నెట్‌రన్‌రేటుతో సంబంధం లేకుండా ఆర్సీబీ నిష్క్రమిస్తుంది. గుజరాత్, రాజస్థాన్‌కు 18 పాయింట్లు ఉండి.. సీఎస్కేను హైదరాబాద్ ఓడించినా.. లక్నోకు పంజాబ్ చెక్ పెట్టినా పటిదార్ బృందానికి అవకాశలు సన్నగిల్లుతాయి. అప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడక తప్పదు.

### రెండు విజయాలతో..

ఐపీఎల్ రికార్డు బ్రేకర్ సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. తదుపరి రెండు మ్యాచుల్లో చెన్నై సూపర్ కింగ్స్, ఆర్సీబీపై గెలిస్తే కమిన్స్ సేన ప్లే ఆఫ్స్‌లో ఉంటుంది. ఒకవేళ చెన్నైపై గెలిచి. బెంగళూరు చేతిలో ఓడితే అప్పుడు పంజాబ్, రాజస్థాన్ తమ తదుపరి మ్యాచుల్లో ఒకే ఒకటి గెలవాలి.

అలాకాకుండా సీఎస్కేపై ఓడి బెంగళూరుపై విజయం సాధిస్తే అప్పుడు పలుజట్లు 16 పాయింట్లతో పోటీలో ఉంటాయి. ప్రస్తుతమున్న 14 పాయింట్లతోనూ సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే.. పంజాబ్, రాజస్థాన్ అన్నింటా ఓడాలి. ఒకవేళ కోల్‌కతా చివరి మూడు మ్యాచుల్లో గెలిస్తే అప్పుడు సమీకరణాలు మారుతాయి.

## పెద్ది ట్రైలర్.. జస్ట్ వావ్ అంటూ చిరు లీక్స్

### ముందే ట్రైలర్ చూసి.. బృందాన్ని ప్రశంసించిన చిరంజీవి



**టాకీస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం మే 18న విడుదల కాబోతున్న ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి ముందే వీక్షించారు. ట్రైలర్ చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చిత్ర యూనిట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రైలర్ గురించి చిరంజీవి ట్వీట్ చేస్తూ.. ఇప్పుడే పెద్ది ట్రైలర్ చూశాను, జస్ట్ వావ్ అంతే! 3 నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ ప్యూర్ పవర్ ప్యాక్డ్‌గా ఉంది. చరణ్, బుచ్చిబాబు, రెహమాన్.. ఇలా ఒక్కొక్కరు తమ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. అందరూ కలిసి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేశారు. ఈ సినిమా గురించి మనం ఎంత ఊహించుకున్నా, ఈ ట్రైలర్ దాన్ని మించి ఉంటుంది. ఇందులో ఎమోషన్, ఎలివేషన్, మ్యాడ్నెస్ అన్నీ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి అని చిరు కొనియాడారు. ఎప్పటికప్పుడు తన సినిమాలకు లేదా చరణ్ సినిమాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను లీక్ చేస్తూ అభిమానులను అలరించే చిరంజీవి, ఈసారి కూడా తన అలవాటును రిపీట్ చేశారు. 'చాలా రోజులయ్యింది మీకు 'చిరు లీక్స్' ఇచ్చి' అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తూ, పెద్ది ట్రైలర్‌లోని ఒక పవర్‌ఫుల్ డైలాగ్‌ను ఆయన లీక్ చేశారు. 'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు? నేను పోరాడాను సారు.. అంటూ ట్రైలర్‌లోని ఈ డైలాగ్ ఎంతో అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ ప్రశంసించారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబుకు క్షమాపణలు చెబుతూ.. 'సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పి లీక్ చేయాల్సి వచ్చింది' అంటూ చిరంజీవి చమత్కరించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ట్రైలర్ మే 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగాస్టార్ స్వయంగా ఇచ్చిన ఈ రివ్యూతో మెగా అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో 'పెద్ది' ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

## విడాకులు వచ్చే వరకు నటించను

### తనపై ట్రోల్స్ రావడంపై కన్నీటి పర్యంత అయిన జయం రవి



**టాకీస్:** తాను ఎన్నో రోజులుగా సహనంతో ఉంటున్నానని.. వ్యక్తిగత విషయాల ఎక్కడా మాట్లాడలేదని నటుడు జయం రవి అన్నారు. ఇప్పుడు మాట్లాడాల్సిన సమయం వచ్చిందన్నారు. తాజా పరిణామాలపై ఆయన మీడియా ముందు మాట్లాడుతూ...తన పిల్లలకు కూడా తనని దూరం చేశారని కన్నీరు పెట్టుకున్నారు. ఇంతకాలం నా వ్యక్తిగత జీవితాన్ని మీతో పంచుకోనందుకు క్షమించండి. విడాకులు వచ్చే వరకూ నా సినిమాలు ఏవీ విడుదల కావు. అప్పటి వరకూ నేను కూడా నటించలేను. నాకు జరిగిన అవమానాలు ఇక భరించడం నా వల్ల కాదు. నన్ను ఇబ్బంది పెట్టాలని చూసేవారు ఆపేవరకూ నేను నటించలేను. ఆఫీసులోనే ఉంటాను. రండి.. ఎంతగా ఇబ్బందిపెడతారో పెట్టండి. ఇకపై నేను మౌనంగా ఉండాలని అనుకోవడం లేదు అంటూ ఎమోషన్ అయ్యారు.




MOVIE TIME

## అనుపమ మరీచిక ట్రైలర్ విడుదల

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ హీరో విరాజ్ అశ్విన్, స్టార్ హీరోయిన్లు రెజీనా కాసాండ్రా, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మరీచిక'. సతీష్ కాసెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా చిలకా ప్రొడక్షన్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, మేఘన చిలకా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సస్పెన్స్, లవ్ అండ్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే.. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'మ్యూజికల్ మాస్ట్రో' ఇళయరాజా సంగీతం అందించడం విశేషం. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అద్భుతమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మే 29న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

## రాజస్థాన్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న నాగచైతన్య 'వృషకర్మ'..

### త్వరలోనే రిలీజ్ అనౌన్స్‌మెంట్!

**టాకీస్:** యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా మైథికల్ థ్రిల్లర్ చిత్రం 'వృషకర్మ'. 'విరూపాక్ష' లాంటి బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన దర్శకుడు కార్తీక్ దండు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ని రాజస్థాన్‌లో పూర్తిచేసుకున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ సినిమాలో నాగచైతన్య సరసన స్టార్ బ్యూటీ మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్ష్ శ్రీవాస్తవ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్‌కు చెందిన 'సుకుమార్ రైటింగ్స్'



భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

మరోవైపు ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భారతీయ ప్రేక్షకులు ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా, ఒక అద్భుతమైన మైథికల్ థ్రిల్లర్ అనుభూతిని అందించేందుకు భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి రాహుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు మరియు శ్రీ నాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

## క్రమశిక్షణ కలిగిన నటుడు విజయ్: మాళవిక



టాకీస్: కోలీవుడ్ అగ్ర కథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్‌పై నటి మాళవిక మోహనన్ ప్రశంసలు కురిపించారు. విజయ్‌తో కలిసి మాస్టర్ సినిమాలో నటించిన ఆమె ఆయనతో తనకున్న స్నేహం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ షూటింగ్‌లోనే విజయ్‌ను తొలిసారి కలిసినట్లు చెప్పారు. మాస్టర్' సినిమా మొదటిరోజు షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చింది. నా డైలాగ్స్ మీదే దృష్టిపెట్టాను. ఆయన మాత్రం ఎలాంటి కష్టమైన సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా ప్రశాంతంగా ఉంటారు. ప్రతి విషయాన్ని గమనిస్తూ పూర్తిగా పని పైనే ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడు అవసరం వచ్చినా ఫోన్ చేయగలిగే స్వేచ్ఛ ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. విజయ్ క్రమశిక్షణ తనపై ప్రభావం చూపిందని ఆమె అన్నారు. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ లాంటి సీనియర్ నటుల సినిమాల్లో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఉదయం 7 గంటలకు కాల్‌షీట్ ఉంటే 6:55కే సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు అని తెలిపారు. 'మాస్టర్' సినిమాలో విజయ్‌తో కలిసి డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని సరదాగా ఇప్పటికీ ఆయనతో చెబుతుంటానని మాళవిక నవ్వుతూ చెప్పారు.

## అగ్రతారల మూవీకి త్రిష దూరం

### కమల్, రజనీ సినిమాను తిరస్కరించినట్లు వార్తలు



టాకీస్: వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హాసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ - రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.